జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి

# ఏ కథకి శిల్పం లేదు



**జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి:** సమాజాన్ని అర్థం చేసుకోడానికి సాహిత్యం దారిదీపంలా ఉపయోగపడాలన్నది ఈ రచయిత దృక్పథం. సంస్కృతాంధ్రాంగ్ల భాషల్లో బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన సాహితీవేత్త జొన్నవిత్తుల రామకృష్ణ గారి నాలుగో అబ్బాయి. అమ్మగారు లక్ష్మీనరసమ్మ. జీవిత భాగస్వామి శ్రీమతి కళ్యాణి. ప్రణవి ఏకైక సంతానం. పుట్టిన ఊరు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం. కానీ వారి సాహిత్య కేంద్రం చిత్తూరు జిల్లాలోని ముష్టూరు. చిన్నతనంలో ఇంట్లోంచి వెళ్ళిపోయి ఏడేళ్ళపాటు దేశమంతా తిరిగారు. దేశంలోని వైరుధ్యాల్నీ, వైవిధ్యాల్నీ దర్శించారు. బతుకులోని బహుళ పార్శ్వాల్ని స్వయంగా అనుభవించారు. ఆ కాలంలో అనేక పనులు చేశారు. అనేకమందిని కలిసారు. జీవితంలోని అనేకతను చూశారు. ఏడేళ్ళ తర్వాత ఇంటికి తిరిగి వచ్చారు. తిరిగి బతుకుదెరువును వెదుక్కుంటూ చిత్తూరుకు వెళ్ళి మిత్రులతో కలిసి ఒక పాఠశాల నిర్వహించారు. పిల్లలకు పాఠాలు నేర్పడంతోపాటు తను కూడా పాఠాలు నేర్చుకున్నారు. ఆ కాలంలోనే విద్యారంగానికి సంబంధించి వ్యాసాలు రాశారు. ఈవిధంగా రచనా వ్యాసాంగాన్ని తెలియకనే సామాజిక బాధ్యతగా స్వీకరించారు. తర్వాతి కాలంలో ఇతర ప్రక్రియల్లోకి వారి రచనా వ్యాసంగం విస్తరించింది. ఈ క్రమాన 'భూమి గుండ్రముంగా ఉండును' అనే కథ మొట్టమొదటిసారి రాశారు. 'ఉదయం' ఆదివారం అనుబంధంలో అచ్చయింది. రాసిన మూడో కథ 'వంజె' అప్పాజోస్యుల విష్ణుభొట్ల ఫౌండేషన్ వారి కథల పోటీలో బహుమతి పొందింది. మొదటి నవల 'వలస దేవర' అమెరికా తెలుగు అసోసియేషన్ వారి నవలల పోటీలో మొదటి బహుమతిని సంపాదించుకుంది. మరో రెండు నవలలు రాశారు. 'జంగమదేవర' నవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక శాఖ వారి పోటీలో బహుమతినందుకుంది. దాదాపు నలభైకి పైగా కథలు రాశారు. 'ది డెత్ ఆఫ్ లాస్ట్ ఇండియన్' కథల సంపుటం అచ్చయిన తొలి కథాసంపుటి. వృత్తిరీత్యా మొదట కన్నడ వృత్తి రచయితగా బుల్లితెర కోసం కొన్ని వందల కార్యక్రమాలకి నిరూపణా సాహిత్యం, మాటలు, పాటలు రాశారు. ప్రస్తుతం మాటీవీ తెలుగువాహినిలో పనిచేస్తున్నారు. కథ చెప్పడంలో మంచి ప్రావీణ్యమున్న ఈ రచయిత రెండో పుస్తకం మీ చేతిలో వుంది. ఈ కథల మేలిమిని చెబుతూ ప్రతి కథకు కొన్ని అంకాలు వేసి పంపించాల్సిందిగా రచయిత కోరుతున్నారు. ప్రతి కథ చివర ఒక పేజీ ఇందుకోసం చేర్చడమైంది. ఒక కథని పూర్తిగా చదవడమంటే ఆ కథలో ఏదో ఒక అంశం లేదా కొన్ని అంశాలు పాఠకుణ్ణి కథ చివరిదాకా నడిపించుకు వెళ్ళడానికి దోహదం చేసి వుంటాయి. కనుక కథల మీద అభిప్రాయాలు తెలియజేస్తే మంచిది. పాఠక ప్రపంచంతో సంభాషణ కోసం చేస్తున్న రచయిత ప్రయత్నానికి సహకరించవలసిందిగా మనవి. మీరు వేసిన మార్కుల్ని ఒక కార్డు మీద రాసి పంపండి.

# ఈ కథకి శిల్పం లేదు

కథల సంపుటి

జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి

పాలపిట్ట–బుక్స్
హైదరాబాద్

**EE KATHAKI SHILPAM LEDU**

by **Jonnavithula Sreeramachandra Murthy**

Mobile: 94400 37258
telakovela4@gmail.com

© Author

| | | |
|---|---|---|
| Cover Painting | : | Kuchi |
| Cover Design | : | Haneef |
| First Edition | : | December 2014 |
| For Copies | : | Palapitta Books<br># 16-11-20/6/1/1<br>403, Vijayasai Residency<br>Saleem Nagar, Malakpet<br>Hyderabad - 500 036<br>Phone: 040-2767 8430<br>palapittabooks@gmail.com<br><br>J.S.R. Murthy<br>Telakovela<br>H.No: 1-2-9/104<br>Devi Nilayam Apartments<br>Old Maruthi Nagar<br>Kothapet,<br>Hyderabad-500 035<br>Mobile No: 99488 96984 |
| Printed at | : | Charita Impressions<br>Azamabad<br>Hyderabad<br>PH: 040-2767 8411 |
| Price | : | ₹ 120 |

# ఇందులో...


1. ముచ్చు ........................................................ 15

2. సురగంగ ........................................................ 25

3. కాకదంత పరీక్ష ........................................................ 37

4. రండి... మళ్ళీ పుడదాం ........................................................ 45

5. నగరళం ........................................................ 61

6. కోఠీలో కోలాహలం ........................................................ 72

7. కడప రెడ్డెమ్మగా మారిన ముష్టూరి పెద్దప్పరెడ్డి కథ ................ 81

8. ఒక వేకువ కోసం ........................................................ 95

9. ముల్లుగాడి కథ ........................................................ 105

10. బోధివృక్షం ........................................................ 116

11. చైతన్య స్రవంతి ........................................................ 127

12. అచుమ్బితమ్ ........................................................ 136

13. ఎంగటవ్వ మాడీ... ........................................................ 148

14. ఆట ఆగిన వేళ... ........................................................ 155

15. వంతెన ........................................................ 167

16. రాగిమాను ........................................................ 181

# ముచ్చు

తిరప్తి రైల్వేస్టేషన్ అంతా ఒకటే రచ్చరచ్చగా ఉంది. రైలు ఎలబారే వేళయితే చాలు ఓ మోపున పడుతూ లేస్తూ, నెట్టుకుంటూ తిట్టుకుంటూ పోతూనే ఉంటారు. కొండ మీద వెంకన్న దర్శనం చేసుకునేదానికి తనకలాడతారు. అదే మాదిరి టిక్కెట్లు తీసుకునేదానికీ ప్లాటుఫారం మీదికి పోయేదానికీ కూడా తనకలాడతానే ఉంటారు. పెద్దోళ్ళంతా పెద్దగా తనకలాడతావుంటే, మేం గమ్మునుండేది దేనికి? అని పిల్లకాయలు కూడా ఓ మోపున ఏడ్చేపని మొదలెత్తుకుంటారు. అదో అట్లా ఏడుస్తా ఉండే పసిబిడ్డని ఏం చేసేదీ దిక్కు తెలవక ఆ పక్కకి తిరిగి పైట అడ్డం పెట్టి పాలిచ్చే పని పట్టింది నారమ్మ.

అంతలోకే పెద్ద కోతుల దండు ఉరుక్కుంటూ వచ్చింది. కోతులన్నీ రైలు పెట్టెల మింద వరసాగ్గా కూచున్నాయి. ముందే కోతులు కదా. ఒక్కోటీ ఒక్కో కోతి పని చేసేపని పట్టింది. అరిటిపండ్లు, టెంకాయి చిప్పలు, అన్నం కారీలు, బిస్కెట్ పాకులు ఇట్లా చిక్కింది చిక్కినట్లే ఎత్తుకునిపోయేదీ పెట్టిమింద కూచుని చించుకునేదీ.

ఆ కోతుల్ని చూసిన కోతి పిల్లకాయలు గమ్మునుంటారా? తాగేసిన ఖాళీ సీసాలూ తినేసిన స్వీట్ డబ్బాలూ వాటి మీదికి వేసే పని పట్టినారు. ఒక డబ్బా నేరుగా పోయి ఓ నచ్చు కోతికి తగిలింది. ఏటు తగుల్తానే దానికి తిక్క లేచింది. ఆ పాట్నే కిందికి దూకింది. దాన్ని చూసి ఆ పిల్లకాయ భయపడి ఉరికినాడు. వాని పాటికి వాడు పోతానే కోతికి కోపం ఎలబారిపాయె. అంతలోకే దాని కండ్లు నారమ్మ మీద పడినాయి. ఆయమ్మ చేతిలో ఉండే పసిగుడ్డు మీద పడినాయి.

ఆ పసిగుడ్డును చూస్తానే దానికి మర్లు పుట్టింది. దానికే బిడ్డని ఎత్తుకొని పోయి బెంచుమింద కూచుంది.

ఆ బిడ్డని చూస్తుంటే కోతిమాతల్లికి ఏ కన్నపేగు కదిలిందో గానీ మురిపెంగా ఎదకి అదంబట్టుకుంది.

ఆ కోతి చేతనున్న బిడ్డని ఎట్లా కాపాడాలనేది ఎవరికీ దిక్కు తెలవలేదు.

నారమ్మ ఓ మోపున ఏడుస్తా ఉంది.

గట్టిగా అరిస్తే కోతి భయపడి బిడ్డని ఎత్తుకుని ఎలబారిపోతుందనీ గమ్మున ఉండమనీ అంతా ఉద్దర సలహాలు చెప్పే పని పట్టినారు. అంతలోకే రైల్వే పోలీసులు వచ్చినారు. పోలీసు చేతిలో లాఠీ చూస్తానే కోతికి భయం ఎత్తుకుంది.

బిడ్డని అట్టనే అదంబట్టుకుని నేరుగా పోయి రైలు పెట్టి పైకి ఎక్కి కూచుంది.

ఇంక నారమ్మ బిడ్డని కాపాడేది ఎవరినించీ కాదని అందరూ తీర్మానించేసినారు.

ఆ పాట్నే నారమ్మ ఏడిచే పని చాలించి నోరు కొట్టుకునే పని పట్టింది.

ఓ పోలీసాయన "ఇప్పుడు గానీ ఏదైనా ముచ్చు రావాల. ఈ కోతే కాదు దానెమ్మ మొగుడైనా కిముక్కుమనకుండా బిడ్డని విడిచిపెట్టి ఉరుకుతా ఉండు" అని నారమ్మతో అంటా వుండాడు.

అంతలోనే ఆ పక్కన రైలు పెట్టి వెనక నించీ పైకి ఎగబడి వచ్చింది ఒక ముచ్చు. వస్తానే పండ్లు బయటపెట్టి గుర్రుమంది. కోతులు ఆ పక్కకి చూశాయి. ఆ పాట్నే ఆ ముచ్చు ముడ్డి పైకెత్తి నిలబడుకుంది. అంతే... దాన్ని చూస్తానే కోతులన్నీ దేనిపాటికి అది, పడతా లేస్తా దడాబడా ఉరుకో ఉరుకు.

బిడ్డని చేతబట్టుకున్న కోతి, కిచకిచలాడతా బిడ్డ సంబరంలో ఉంది. దానికే, అక్కాపక్కా గమనించకుండా ఆ బిడ్డ తల్లో పేన్లు చూసేపనికి మళ్ళుకుంది. కోతులకి పేన్లుంటే చాలు ప్రపంచం పరిగలు పట్టి పోయినా దిక్కు తెలవదు.

ఆ కోతి పేన్ల పనిలో మునిగిపోయి ఉన్న మాట గమనించింది ముచ్చు. దానికే మెల్లగా దాని వెనకే చేరింది. మెడ పైకెత్తి పసిబిడ్డని అదే పనిగా గమనించే పని పట్టింది. కోతికీ కొండముచ్చుకీ తేడా తెలవని జనాలకి ఈ కోతిని చూడగానే ఆ కోతులన్నీ ఎందుకట్లా భయపడి ఉరికినాయనేది తెలవదు. దానికే ఆ ముచ్చు, కోతి చేరి బిడ్డని ఏం చేస్తాయో అనే భయంతో అల్లాడతా ఉన్నారు.

ఆ బిడ్డని అదే పనిగా చూస్తానే ఉంది ముచ్చు. వెనక నించీ మెల్లగా చేతిని బిడ్డ మీద పెట్టింది. రెండో చేత్తో కమ్మీని పట్టుకుని కోతి ముకంలో ముకం పెట్టి గుర్రుమంది.

అంతే... కోతి తన ఎదకి అదుముకున్న బిడ్డని అట్లాగే వదిలిపెట్టింది. ఆ పాట్నే ముచ్చు ముడ్డిపైకెత్తింది. అంతే చేతనున్న బిడ్డనీ, పేన్లనీ విడిచిపెట్టి ఉరికే పని పట్టింది కోతి.

కోతి చేతి నించీ ముచ్చు చేతికి మారింది బిడ్డ. అయినా నారమ్మకి ఏం లాభం?

దానికే, ఆయమ్మ నోరుకొట్టుకునే పని చాలించి తలకొట్టుకునే పని పట్టింది.

రైలు పెట్టె మీద నించీ జనాలని దిగమళ్ళుకుని చూసింది ఆ ముచ్చు.

చూసినంతసేపూ చూసి... చూస్తాన్నిట్లే నారమ్మ ఎదురుగా దుంకింది.

ముచ్చు చేతినించి బిడ్డని తీసుకునేది ఎట్లా అనేది ఎవరికీ దిక్కు తెలవలా.

అందరూ అదే పనిగా బుర్రలు గీరుకుంటూ చూస్తా ఉంటే, ముచ్చుకి జాలనిపించె.

దానికే బిడ్డని నారమ్మ చేతబెట్టి గుర్రుమంది.

నారమ్మ తలకొట్టుకునే పని చాలించి బిడ్డని ముద్దుల్తో నింపే పనిపట్టింది.

* * *

ముష్టూరులో అంజయ్య అంటే తెలిసినోడు లేడు. ముచ్చోడు అంటే తెలవనోడు లేడు. దేనికంటే, ఆయనది ముచ్చు వంశం.

ఆ వంశంలో పుట్టినోళ్ళందరూ ముచ్చుల్ని పెంచాల్సిందే కోతుల్ని తరుముకో వలసిందే. వాళ్ళకు ముచ్చు కొలువు ఇచ్చింది గుర్రంకొండ నవాబు. సుమారు నాలుగు నూర్ల సంవత్సరాలకు ముందు గుర్రంకొండ కోట కట్టిపించినప్పుడు ముచ్చోడి తాత ముత్తాతల తాతగార్లు ఓ కొత్త కొలువు సంపాదించినారు. అదే ముచ్చు కొలువు.

కోటలో నవాబుగారు కట్టుకున్నోళ్ళూ పెట్టుకున్నోళ్ళూ చేరి సుమారు పద్దైదుమంది అందగత్తెలు ఉన్నారు. వాళ్ళకి దినామూ పండ్లూ కాయలూ వంటలూ అంపిస్తా ఉండేవాడు నవాబు. గుర్రంకొండ కోతులు వాటం చూసి అవన్నీ ఎత్తుకొనిపోతా ఉండేవి. అంతేకాదు నవాబమ్మలు ఆరేసుకున్న గుడ్డలు ఎత్తుకొనిపోయి చించి చించి పెడతా ఉండేవి. ఆ కోతుల్ని పట్టేదానికి నవాబు పడతావున్న అగచాట్లు ఒకటా రెండా?

ఎట్లాంటి పనిమంతుల్ని పిలవనంపినా ఆ కోతుల్ని అడ్డగించుకునేది ఎవర్నించీ కాలేదు. అదో, అప్పుడు మన ముష్టూరు ముసవ నారాయణప్ప కోటకి పోయినాడు. బంగారు ఉంగరం పెడితే కోతులు రాకుండా చేస్తానని చెప్పినాడు.

గుర్రంకొండ ఏమైనా నవాబుగారు కూలికి పోయి సంపాదించిన సొత్తా? దానికే హెచ్చులు పోతా "కోతులు రాకుండా చూడాల్నే గానీ ఒకటేమిటి ఇంట్లో అందరికీ ఒక్కో ఉంగరం పెడతా" అన్నాడు.

ఆ పాట్నే ముసవ నారాయణప్ప తిరప్తి కొండకి పోయినాడు. కొండంతా తారాడి ఎట్లాగో కన్న అగచాట్లన్నీ పడి ఒక ముచ్చును పట్టినాడు. దాన్ని తోడుకొని కోటకి పోయినాడు.

ముచ్చు మాట తెలవని నవాబు అది కూడా కోతే అనుకున్నాడు. దానికే ముసవ నారాయణప్ప ముడ్డికి పట్టి నాలుగేట్లు వేసి, “రేయ్ బందర్ కే బచ్చే, బందర్‌కో భగానేకో బందర్ కైకో లేలేకో ఆయాసో సువ్వర్” అంటా గదురుకున్నాడు. అయినా ముసవ నారాయణప్ప ఎదురు మాట్లాడకుండా గమ్మునుండిపోయినాడు.

మరుసటి దినం కోటలోకి కోతులు వస్తానే ముసవ నారాయణప్ప ముచ్చుని పట్టుకుని కోటంతా తిప్పినాడు. దాన్ని చూసి భయపడి కోతులన్నీ ఓ మోపున ఉరుకుతావుంటే నవాబుగారు పడీ పడీ నగినాడు. అప్పుడుగానీ ఆ నవాబుకి ముచ్చు మహత్తెం తెలవలేదు.

అన్నమాట ప్రకారం నారాయణప్పకి ఉంగరం చేపించి ఆయనకు కోటలో కోతులను తరుంకునే ముచ్చు కొలువిప్పించినాడు నవాబు.

కాలాలు మారిపోయి నవాబులు పోయినారు. కానీ, ఆ ముచ్చు వంశం మాత్రం అట్లాగే ముచ్చుల్ని తిప్పుకుంటా కాలం ఎల్లదీస్తా ఉంది.

ఇప్పుడు అంజయ్యకి ఉండే ఆస్తులు రెండు,నవాబుగారి ఇనాము ఉంగరం, ముచ్చు.

* * *

అంజయ్యకి ఒక మరదాలుంది. ఆయమ్మి పేరు అక్కమ్మ.

ముష్టూరు పైకి అక్కమ్మే అందగత్తె.

దానికే... పంచాంగం అయ్యవారి కొడుకునించీ ఆసాది పూజార్ల పిల్లకాయల దాకా అందరి కండ్లూ ఆయమ్మి మీదే. ఆయమ్మి పెద్దపాప అయినమాట తెలుస్తానే రెడ్డేరి మాడీ కండ్లు కూడా ఆయమ్మి మీద పడినాయి. దానికే అక్కమ్మని అంపిస్తే అడిగిందిస్తానని ఆయమ్మి అమ్మానాయనలకు రాయబారం అంపినాడు రెడ్డి.

పాపం, వాండ్లకి ఏమి చేసేదీ దిక్కు తెలవలేదు.

దానికే అంజయ్యని పిలవనంపి రాత్రికి రాత్రే ముష్టూరమ్మ గుడిలో పెండ్లి చేసినారు. ఆయమ్మిని అంజయ్య చేత పెట్టినారు. నీ పెండ్లాం నీ ఇష్టం ఎట్లా సాక్కుంటావో సాక్కో పొమ్మని చేతనున్న దుడ్లు ఈనాముగా ఇచ్చి మొలకలచెరువు అంపేసినారు.

* * *

కొత్త ఊరు... కొత్త మనషులు... కొత్త చుట్టిల్లు... కొత్త పెండ్లాం... కొత్త మరులు... కొత్త మురిపాలు! కొత్త కొత్తగా కలల్లో తేలిపోతా ఉన్నాడు అంజయ్య.

వయసు పిల్లకాయలకు ఆస్తంటే పెద్దోళ్ళ మాదిరి చేన్లూ, మడులూ, బంగారూ కాదు. ఆడోళ్ళకి అందం. మగోళ్ళకి మగతనం. అవే దేవుడిచ్చిన ఆస్తిపాస్తులు. దానికే తొలిరేయి అంజయ్యని పక్కలోకి రానియ్యలేదు అక్కమ్మ. “నీ ముచ్చు మొకానికి నేను

కావాల్నా?" అంటూ ఆ పక్కకి తిరిగి పడుకునింది. ఆ మాటలన్నది ఆయమ్మి కాదు. ఆయమ్మి అందం.

అక్కమ్మ తెలుపు. అంజయ్య నలుపు! అక్కమ్మ చందమామ, అంజయ్య అందులో మచ్చ! అక్కమ్మ తీర్చిన బొమ్మ, అంజయ్య అనాకారి! ఈడూజోడూ తప్ప అందంచందం లేని జోడి!

ఈ మాట అంజయ్యకి కూడా తెలుసు. దానికే ఆయమ్మి తనకి తానుగా వచ్చేదాకా బలవంతం చెయ్యరాదని తీర్మానించుకున్నాడు. ఆ దినంనించీ ఆయమ్మి, అంజయ్యకి అక్కా కాకపోయె! అమ్మాకాకపోయె! కడపటికి ఆలి కూడా కాకుండా పోయె!

ఆలి, మొగుణ్ణి దగ్గరికి రానియ్యలేదని కాలం గమ్మునుంటాదా?

దాని పాటికి అది ఉరుకుతావుంటే కండ్లు మూసి తెరుస్తాన్నిట్టే ఏడాది గడచిపాయె.

ఒకతూరి మొలకల చెరువుకు దొమ్మరాట వచ్చింది. అది ఏడు దినాల ఆట. దినానికో విద్య చూపిస్తారు. తాడు మీద నడిచేదీ, కండ్లతో సూదిని తీసేదీ, గంగమ్మని ఎత్తుకుని ఎగిరేదీ, కత్తి యుద్ధాలు చేసేదీ, జాటీల్తో కొట్టుకునేదీ, సినిమా పాటలు పెట్టి రికార్డింగ్ డాన్సులు వేసేదీ. ఇట్లా ఏడు దినాలూ విద్యలు చూసిస్తానే ఉంటారు. వాండ్లలో ఒక వయసు పిల్లకాయ ఉన్నాడు. బో అందగాడు. ఏటుకి ఏడు మందిని పడేసినట్టున్నాడు. ఆయప్ప ఏడుదినాలూ సైకిలు తొక్కుతూనే ఉంటాడు. తెల్లవారింది మొదలు ఆ సైకిలు మీదనే ఉంటాడు. తిండి తీర్థం కూడా దాని మీదనే. ఆయప్ప ఎప్పుడు చూసినా అట్లా సైకిలు మీదే కనిపిస్తా ఉంటే ఊరు ఊరంతా విచిత్రపోయి చూసింది.

అంజయ్య ముచ్చుని ఇప్పించుకుని ఆ సైకలాయప్ప ఆడించిన ఆటలు ఒకటా రెండా? అంజయ్య ఆడించే ఆటలన్నీ ఆయప్ప కూడా ఆడించినాడు. పిల్లకాయల్ను నగిపించినాడు. ఈ వారం దినాల్లోనే సైకలాయప్పా ముచ్చూ మంచి నేస్తులయిపోయినారు. ఇదంతా చూసేదానికి అంజయ్యక్కూడా కుశాలగా ఉండింది.

కడపటి దినం అసలైన ఆట.

ఊరు నడిమధ్యన పెద్ద గుంత తవ్వినారు. దానికి పూజలు చేసినారు. సైకిలాయప్ప సైకిలు దిగినాడు. పదకొండు కడవల్తో ఉడుకుడుకు నీళ్ళు పోసుకున్నాడు అందరికీ చేతులెత్తి మొక్కినాడు. గుంతలోకి దిగినాడు. అందరూ చూస్తా ఉండంగానే గుంత మీద కడప బండలు పరిచినారు. దానిమింద మన్నుపోసి ఆయప్పని బతికున్నట్లే సమాధి చేసినారు. జనాలంతా బిత్తరపోయి చూస్తానే ఉన్నారు.

సైకిలాయప్ప సమాధి మీద ఊదువత్తులు గుచ్చినారు. దీపం పెట్టినారు.

తరువాత సామాన్లు మూటలు కట్టి పెట్టేసినారు. ఊరోళ్ళు అంపిన వంటలన్నీ ఎత్తిపెట్టుకున్నారు. ఆ రాత్రి ఊరు ఉరంతా దొమ్మరాట ఆడినవాండ్లని పొగిడింది పొగిడిందే.

అట్లా పొగుడుకుంటూనే ఆవులిస్తా నిద్దరపోయింది మొలకల చెరువు.

ఆ సమాదిమాటే ఆలోచిస్తా పండుకున్న పిల్లకాయలకు రేయంతా నిద్దరే పట్టలేదు. దానికే తెల్లవారి లేస్తానే సమాధికాడికి పోయినారు. దాన్ని తవ్వినారు. లోపల చూస్తే ఏముంది? ఏమీలేదు!

సమాధిలో ఉండాల్సిన సైకిలాయప్ప ఏమైపోయినాడు? ఎట్లా పోయినాడు? అసలు సచ్చినాడా లేదా? బతికితే ఎట్లా బతికినాడు? ఇట్లా ఎవరి పాటికి వాళ్ళు బిత్తరపోతానే ఉన్నారు.

ఊరు ఊరంతా ఒకదానికి బిత్తరపోతా వుంటే, అంజయ్య మాత్రం ఇంకోదానికి బిత్తరపోయినాడు.

దేనికంటే... ఆయప్పకి చుట్టింట్లో అక్కమ్మ కనపడరాలా! బయట ముచ్చు కనపడరాలా!

ఇక్కడ చూస్తే సమాధిలో సైకలిలాయప్ప మాయం!

ఎప్పుడు కలిసిందో? ఎట్లా కలిసిందో? ఏం మాట్లాడుకున్నారో? ఏ దారి పట్టిపోయినారో? ఇట్లాంటివి ఏమీ యోచన చెయ్యలేదు అంజయ్య. ఎక్కడున్నా ఆయమ్మ బాగుంటే చాలు అనుకున్నాడే గానీ ఆయమ్మ మోసం చేసిందని కూడా బాధపడలా! కడపటికి ఆయమ్మకి సైకలాయప్పే బాగా సరిపోతాడనుకుని గమ్మునైపోయినాడు.

అంజయ్యకి అక్కమ్మ ఆలికాకపోతే పాయె! కడపటికి అమ్మా కాకపాయె! అక్కా కాకపాయె! తెలిసినోళ్ళందరూ అక్కమ్మ మాట అడుగుతా ఉంటే ఏం చెప్పేదీ దిక్కు తెలవలేదు.

ఉండూర్లో ఉండలేని మనుషులందరికీ తిరప్తి ఉండనే ఉంది. దానికే సట్టీ బుట్టీ కట్టుకుని తిరప్తి చేరినాడు.

అక్కడ పోటీలు పోయేదానికి పొలం పనులుంటే కదా?

దానికే తెలిసినోళ్ళని పట్టి అద్దె రిక్షా వేసేపని పట్టినాడు.

కాలం చేసిన వాళ్ళు కాలం చేస్తారు. కానీ కాలం మాత్రం కాలం చెయ్యదు. కాలినొప్పనే మాటే లేకుండా ఓ మోపున ఉరుకుతూనే ఉంటుంది.

చూస్తానిట్లే ఇరవై ఏండ్లు గడిచిపోయినాయి. తిరప్తిలో ఆటోలు జాస్తి అయినాయి. రిక్షాలు తగ్గినాయి. సెవెన్ సీటర్లు వచ్చినాక రిక్షాలు ఎక్కేది తీరమానంగా చాలించినారు.

ఇప్పుడు అవి సామాన్లు మోసేదానికి తప్ప దేనికీ అక్కర పట్టలేదు.

అంజయ్యకి ముందా? వెనకా? సాకాల్సింది ఒకటే కడుపు. దాన్ని నింపుకునే దానికి రిక్షా చాలు. అది మోసే సామాన్లు చాలు. దానికే ఎట్లాంటి తాపత్రయం లేకుండా ఆయన పాటికి ఆయన బతకతా ఉన్నాడు.

ఒక దినం బస్టాండు కాడ మూటలు దించి వెనక్కి మళ్ళుకుంటా వుంటే ఒకాయమ్మ కండ్లబడినాది. ఆయమ్మ బస్టాండు మెట్ల మీద చెత్తలో చెత్తమాదిరి పడుకుని వుంది.

ఆయమ్మ ఆ పక్కకి తిరగతా ఉండగా గమనించినాడు అంజయ్య. చూస్తే అక్కమ్మ మాదిరే ఉంది. దానికే అదే పనిగా పోయి ముఖానికి కప్పుకుని వుండే గుడ్డని తొలగించి చూసినాడు. అనుమానం లేదు. ఆయమ్మ అక్కమ్మే. అంజయ్యను చూసి ఓ మోపున ఏడిచే పని పట్టింది.

ఆయమ్మ ముఖం నిండా పుండ్లు. పుండ్ల నిండా ఈగలు. ఆ ఈగల్ని తోలి ఆయమ్మని లేవమన్నాడు. ఆయమ్మ లేవలేకుండా ఉంటే తనే చెయ్యి పట్టి లేవబట్టినాడు. మెల్లగా తోడుకుని పోయి రిక్షాలో కూచుండబెట్టినాడు. నేరుగా తన చుట్టింటికి తోడుకొని పోయినాడు. అక్కడ ఆయమ్మ అరువుగా పైకి పోసుకుని గుడ్డలు మార్చుకుంది. అంజయ్యే అంత అన్నం ఉడకేసినాడు.

మరుసటి దినం అక్కమ్మని రూయా ఆస్పత్రికి తోడుకునిపోయి చూపించాలని తీర్మానం చేసుకున్నాడు. ఆస్పత్రికి పోవాలంటే దుడ్లు కావాల. దానికే తెల్లవారతానే ఊరంతా అప్పుకి తిరిగినాడు. ఇన్నూరు రూపాయలు చిక్కినాయి. ఆ దుడ్లతో ఆస్పత్రికి తోడుకొని పోయి చూపించినాడు. ఆయమ్మకి పెద్దాపరేషన్ చేస్తే గానీ బతకదన్నారు డాక్టర్లు. అప్పటి దాకా బతికేదానికి మందులు రాసిచ్చినారు.

ఆ మందులకే సుమారు దుడ్లు కావాల. అంత సంపాదించేది తన వల్ల కాదు. దానికే వేలికున్న ఉంగరం అమ్మేసినాడు. మందులు తెచ్చినాడు.

నవాబుగారి ఈనాము ఉంగరం అమ్మేసిన మాట తెలుస్తానే ఓ మోపున ఏడ్చింది అక్కమ్మ. ఇడిచిపోయిందాన్ని బతికించేదానికి తాత ముత్తాతల ఆస్తి అమ్మేది దేనికంటూ తిట్టేపని పట్టింది. అయినా అంజయ్య మతించలేదు.

మరుసటి దినం యూనివర్సిటీ పక్కగా ఉండే కట్టమింద యోచన చేస్తా కూచుని ఉన్నాడు అంజయ్య. అక్కమ్మ బతకాలంటే ఆపరేషన్ చెయ్యాల. ఆపరేషన్ చెయ్యాలంటే దుడ్లు కావాల. దుడ్లు కావాలంటే ఏం చెయ్యాల? ఏం చెయ్యల?? ఏం చెయ్యాల???

ఎంత యోచన చేసినా ఏమి చెయ్యాలనేది దిక్కు తెలవలా. పిచ్చోని మాదిరి దిక్కులు

దిక్కులు చూస్తా ఉన్నాడు. అంతలోకే ఒకాయమ్మి పుస్తకాలు ఎత్తుకొని వస్తా కనపడె. అంతలోకే ఈ పక్కనించీ కోతుల దండు ఎలబారి వస్తా ఉండె. చూస్తాన్నిట్టే ఒక తులువ కోతి ఉరుక్కుంటూ పోయి ఆయమ్మి పై గుడ్డ ఎత్తుకుని ఉరికేపని పట్టె. అంజయ్య ముందూ వెనకా చూడకుండా పోయి ఆ కోతి చేతనున్న పై గుడ్డని పట్టి పెరికినాడు. అంజయ్య చేతినించీ గుడ్డని పెరికేదానికి చూసింది కోతి. వల్ల పడలా. కడపటికి గుడ్డని వాసన పట్టి చూసింది. అది తినేదానికి పనికిరాదని తెలుస్తానే దాన్ని అట్లాగే విడిచిపెట్టి తన పాటికి తను ఉరుక్కుంటూ పోయింది.

అంజయ్య వచ్చేతలికి ఆయమ్మి దిక్కులు  దిక్కులు చూస్తా ఉంది. అట్లాగే అదుర్తా అదుర్తా ఆ గుడ్డని ఎత్తుకుంది.

అంతలోకే యూనివర్సిటీ అయ్యవారు వచ్చినాడు. అంజయ్యకి 'థాంక్సండీ' అని చెప్పినాడు. అంతేకాదు, "యూనివర్సిటీలో కోతుల గలభా తట్టుకునేదానికి కాకుండా ఉంది. చూస్తాంటే నీకు కోతుల వాటం బాగా తెలిసినట్టుండాది. ఎవరైనా కోతుల్ని తరుంకునేటోళ్ళుంటే చూడు. పిల్లకాయలందర్తో ఒక్కో రూపాయిప్పిస్తా. అయ్యవార్లంతా అయిదేసిస్తాం. ఆ దుడ్లతో ఒక కుటుంబం బంగారుగా బతికిపోవచ్చు" అని చెప్పినాడు.

ఆ మాట వింటానే అంజయ్యకి దుడ్లు సంపాదించేదానికి కొత్త దోవ దొరికే వాటం కనిపించింది. నిజమే, బస్టాండు కాడా రైలు టేషన్ కాడా కోతుల రచ్చ అంతా ఇంతా కాదు. ఈ యూనివర్సిటీ మాదిరే ఆ టేషన్, బస్టాండు.

దుడ్లు సంపాదించే దావ కనపడింది.

ఇంక సంపాదించి పెట్టే ముచ్చు ఒకటే కొదవ.

ఆ కాలంలో దుడ్లు సంపాదించే దావ తారాడుకుంటా గుఱ్ఱంకొండ నవాబుకాడికి పోయినాడు ముసవ నారాయణప్ప. అంజయ్య అట్లా కాదు, దుడ్లు సంపాదించే దావే ఆయన్ను తారాడుకుంటూ వచ్చింది. 'ఇంక ముచ్చుని పట్టుకొచ్చుకుంటే అక్కమ్మ ఆపరేషన్ చేపించేది పెద్దపని కాదు. అంజయ్య సంబరంగా ఉరుక్కుంటా కపిలతీర్థం కాడినించీ ముచ్చుల్ని తారాడుకుంటా ఎలబారినాడు. ముచ్చులు కనపడరాలా. కొండలు... ఎక్కడ పట్టినా పచ్చని చెట్లతో నేలతల్లి సంబరం చేసుకుంటూ వుంది. కొండలమింద యాడపట్టినా కోతులు... కోతులు... ఒకటే కోతులు... కొండల మీద కూడా కొండముచ్చులు లేకుంటే ఇంక ఎక్కడ తారాడేదప్పా అని యెసనంగా వెనక్కు మళ్ళుకున్నాడు. అట్లా మూడు దినాలు కొండలన్నీ తారాడినాడు. ఎక్కడా ముచ్చనేదే కనపడరాలేదు.

దావ కనిపించినా దావలో ఎగబడి వచ్చేదానికి ముచ్చు కనపడరాక అంజయ్యకి

దిక్కు తెలవకుండా పోయింది. యోచన చేసినాడు. యోచన చేసినాడు. అట్లా యోచన చేసీ చేసీ కడపటికి ఒక తీర్మానం చేసుకున్నాడు.

ఉంగరం అమ్మినంక మందులకు పోను మిగిలిన దుడ్లను ఎత్తి జోబిలో పెట్టుకొని ఎలబారినాడు. అంగళ్ళన్నీ తిరిగి అక్కర పట్టినవన్నీ కొనుక్కున్నాడు. ముచ్చును ఆడించీ ఆడించీ నేర్చిన విద్యలన్నీ గెవనం చేసుకున్నాడు. ముచ్చు మాదిరి ఆడిన పిల్లాటలన్నీ గెవనం చేసుకున్నాడు.

అంజయ్య చేస్తావుండే పని చూస్తా ఉంటే అక్కమ్మకి కడుపు రగిలిపోతా వుంది.

ఆయప్పకి తను అక్క కాలా... అమ్మ కాలా... ఆలి అసలుకే కాలా! ఏమీ కాని మనిషి కోసం అంజయ్య అన్నీ అయి అగచాట్లు పడతావుంటే ఆయమ్మ కండ్లలో నీళ్ళు ఎల్లవ కడతాండాయి.

అంజయ్య ముచ్చు కొలువుకి ఎలబారిపోతా వుంటే ఆయప్ప కాళ్ళమిందపడి ఒక మోపున ఏడ్చింది అక్కమ్మ. అయినా ఆయప్ప తగ్గలేదు.

* * *

నారమ్మ బిడ్డని ఎదకి అదంబట్టుకుని ముచ్చు మొకంలోకి చూసింది. “సామీ ఆంజనేయా... నువ్వే నా బిడ్డని కాపాడినావు సామీ... వీడు నీ పెసాదమే... వీనికి నీ పేరే పెట్టుకుంటా” అంటూ కండ్లు మూసుకుని మొక్కింది.

“బంగారాకట్టా బిడ్డకి నా పేరు దేనిగ్గానీ బుద్ది పుట్టినంత ఇస్తే నేనే నీకు మొక్కుతా తల్లీ” అని నారమ్మకి చెప్పి, చుట్టూ ఉన్న జనాలని చూసి “అయ్యా ఒకటీ రెండూ కాదు సామీ ఇచ్చేట్టుగా వుంటే ఐదూ పదీ ఇయ్యాల...! మీ పిల్లకాయలు సల్లగుండాల! మీ ఇల్లు బంగారం కావాల!” అంటూ ఎగుర్లాడతా ఎదురు మొక్కేపని పట్టింది ముచ్చు.

***కరి సీతారామయ్య స్మృతిసాహితి – నవ్య వీక్లీ ఉగాది కథల పోటీలో బహుమతి, 4 ఏప్రిల్ 2013***

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Ee+Kathaki+Shilpam+Ledu**

* * *